www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

Galaxy S25 Ultra
Galaxy AI

శుక్రవారం | 28-3-2025 | పేజీలు: 6 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 86 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం,తిథి: చతుర్దశి రా.7:56 తదుపరి అమావాస్య, నక్షత్రం: పూర్వాభాద్ర రా.10:09 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: తె. ఉ. 7:45, అమృతఘడియలు: మ.2:57-4:23, దుర్ముహూర్తం: ఉ.8:41-9:30, మ.12:44-1:33, రాహుకాలం: ఉ. 10:30-12:00, సూర్యోదయం: 6:16, సూర్యాస్తమయం: 6:24 | శ్రీకాకుళం

Srikakulam | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
1
శుక్రవారం | 28-3-2025
Srikakulam | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Vijayawada | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | పార్వతీపురం మన్యం

రీసర్వేలో లోపాలు ఉండకూడదు: జేసీ

కొమరాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపడుతున్న రెండో విడత రీసర్వేలో ఎక్కడ లోపాలు ఉండరాదని సంయుక్త కలెక్టర్ ఎస్ఎస్ శోభిక అన్నారు. విక్రాంపురం గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే కార్యక్రమాన్ని ఆమె గురువారం పరిశీలించారు. భూముల డాక్యుమెంట్లు పక్కాగా ఉన్నది లేనిది సమగ్ర విచారణ చేపట్టి తుది నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రీసర్వేలో తలెత్తిన లోపాలను భూయజమానికి ముందుగా నోటీసు ద్వారా తెలియజేయాలని తహసీల్దార్‌కు సూచించారు. వివాదాస్పద భూములకు సంబంధించిన వివరాలు ఆయా రిజిష్టర్లలో నమోదు చేయాలని స్పష్టం చేశారు.

30 నుంచి తోటపల్లిలో నవరాత్రి మహోత్సవాలు

గరుగుబిల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తోటపల్లిలోని శ్రీవేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల్లో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 6 వరకు శ్రీరామ వసంత నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ తెలిపారు. 30న ఉగాది పర్వదినం సందర్భంగా పంచాంగ పఠనం, ఏప్రిల్ 6న సీతారామస్వామి వారి కల్యాణం, పట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. కల్యాణంలో పాల్గొనే దంపతులు రూ.500 చెల్లించాలని కోరారు.

ఇంకెన్నాళ్లీ ఘీంకరింపు


తోటపల్లి - గుమ్మపూర్ ప్రధాన రహదారిపై సంచరిస్తున్న ఏనుగులు (ఫైల్)

- మన్యం వాసులను వీడని గజరాజుల బెడద
- దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్య
- ఇప్పటివరకు 27 మంది మృతి, ముగ్గురికి గాయాలు
- వివిధ సంఘటనల్లో ఏనుగులూ మృత్యువాత
- వాటి తరలింపునకు అడుగులు పడని వైనం
- రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు
- త్వరగా జిల్లాకు కుంకీలను తెప్పించాలని విన్నపం

జియ్యమ్మవలస, మార్చి 27 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట ఏనుగులు బీభత్సం సృష్టిస్తూ.. ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నా.. వాటి తరలింపు చర్యలు మాత్రం ముందుకు కదలడం లేదు. ఇదొక ఎన్నికల హామీగానే మారింది. దీంతో జిల్లావాసులకు ఏనుగుల బెడద తప్పడం లేదు. జిల్లావాసులను గజరాజులు ఏళ్ల తరబడి వేధిస్తున్నాయి. పార్వతీపురం, పాలకొండ డివిజన్లలో ఓ వైపు పంటలను నాశనం చేస్తూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏటా ఆస్తి, ప్రాణనష్టాలతో అలజడి సృష్టిస్తున్నాయి. ప్రస్తుతం పార్వతీపురం, భామినిలో రెండు గుంపులుగా సంచరిస్తున్న ఏనుగుల కారణంగా ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఇప్పటి వరకు వాటి వల్ల 'మన్యం'లో 27 మంది మరణించారు. ముగ్గురు గాయాలపాలయ్యారు. వివిధ సంఘటనల్లో ఏనుగులూ కూడా మృత్యువాత పడ్డాయి. వాటి తరలింపు విషయంలో గత వైసీపీ సర్కారు హామీలతోనే కాలయాపన చేసిన నేపథ్యంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంపైనే 'మన్యం' వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తక్షణమే కుంకీలను జిల్లాకు రప్పించి.. ఈ ప్రాంతం నుంచి గజరాజులను తరలించాలని వారు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఒడిశా రాష్ట్రంలోని లఖేరీ అభయారణ్యం నుంచి 1998 అక్టోబరు 2న తొలుత జిల్లాలోని కురుపాం మండలం పనసభద్ర గ్రామ పరిధిలోకి 11 ఏనుగులు ప్రవేశించాయి. పాలకొండ రేంజ్ పరిధిలోకి 2007లో గజరాజుల గుంపు ప్రవేశించింది. ఏటా అవి అనేక ఎకరాల్లో పంటలు నాశనం చేస్తూ అటు రైతులు, ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా వాటి తరలించే విషయంలో, పునరావాసం కల్పించడంలో అడుగులు పడడం లేదు. మరోవైపు పంట నష్టపరిహారం చెల్లింపుల్లోనూ రైతులకు నిరాశే ఎదురవుతోంది. మొత్తంగా ఏనుగుల ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు రక్షణ లేకుండాపోతోంది.


నష్టపోయిన ఇలాంటి పంటలెన్నో..

గజరాజుల కారణంగా మరణాలు పరిశీలిస్తే..

- 1998, అక్టోబరు 5న కురుపాం మండలం పనసభద్ర గ్రామానికి చెందిన పత్తిక దండు.
- 1999, మే 30న అదే మండలం పొలంగూడ గ్రామానికి చెందిన కె.సోంబేరి, ఆగస్టు 28న బొడ్డగూడకు చెందిన ఎం.శాంతమ్మ
- 2007 ఆగస్టు 13న అడ్డంగూడకు చెందిన బి.సొంబ, ఆగస్టు 21న వాడబాయి గ్రామానికి చెందిన టి.పరిసి, టి.డ్రింబమ్మ, టి.ధర్మారావు, అక్టోబరు 11న నాగరకుంటుబాయికి చెందిన టి.ప్రభాకరరావు
- 2008 ఏప్రిల్ 15న గడసింగుపురం గ్రామానికి చెందిన ఎస్.యర్రన్న
- 2019 జనవరి 12న పార్వతీపురం మండలం నాయుడుపేటకు చెందిన ఎన్.పకీరు, మే 21న జియ్యమ్మవలస మండలం పెదకుదమ గ్రామానికి చెందిన కె.కాశిందొర, డిసెంబరు 6న ఇదే మండలం బాసంగి గ్రామానికి చెందిన గంట చిన్నమ్మి
- 2020 అక్టోబరు 29న కొమరాడ మండలం గుమడ గ్రామానికి చెందిన వై.నారాయణరావు, నవంబరు 13న ఇదే మండలం (మిగతా 4వ పేజీలో..)

ఏనుగుల మృత్యువాత..

- 2008-09లో జియ్యమ్మవలస మండలం గడసింగుపురం పంచాయతీ సీమలవానివలస వద్ద అప్పటి ప్రభుత్వం ఆపరేషన్ గజ నిర్వహించింది. ఈ కార్యక్రమం ద్వారా ఒడిశాకు ఏనుగుల తరలింపునకు శ్రీకారం చుట్టారు. కానీ ఆ తరలింపు మార్గమధ్యంలో మూడు ఏనుగులు చనిపోయాయి. దీంతో కార్యక్రమాన్ని మధ్యలో విరమించారు.
- 2023 మే 12న పాలకొండ రేంజ్ పరిధిలో బాలేరు బీట్ కాట్రగడ్డ-13 గ్రామం వద్ద నాలుగు ఏనుగులు మృతి చెందాయి. ఇందులో మూడు నుంచి నాలుగు సంవత్సరాల గున్న ఏనుగు ఒకటి ఉంది.
- అంతకముందు కొమరాడ మండలం అర్తాం వద్ద విద్యుత్ షాక్‌తో ఒక ఏనుగు మృతి చెందింది.
- ఆ తరువాత కొమరాడ మండలం కళ్లికోట వద్ద నాగావళి నదిలో మట్టిలో కూరుకుపోయి మరో ఏనుగు మృత్యువాత పడింది.
- జియ్యమ్మవలస మండలం బిత్రపాడు పంచాయతీ సమీపంలో అనారోగ్యంతో మరో ఏనుగు మృతి చెందింది.

వ్యసనాలకు బానిసై.. దొంగగా మారి

- 17 ద్విచక్ర వాహనాల చోరీ
- మూడు జిల్లాల్లో 13 కేసులు
- నిందితుడి అరెస్టు.. బైక్‌ల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మాధవరెడ్డి


స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసు సిబ్బంది


విలేకరులకు వివరాలు చెబుతున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై ఓ వ్యక్తి దొంగగా మారాడు. వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసి వాటిని విక్రయించి ఆ డబ్బులతో జల్సాలు చేసేవాడు. ఈ చోరీలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. టెక్నాలజీతో ఆ దొంగను కనిపెట్టి కటకటాల్లోకి నెట్టారు. 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి విలేకరులకు వెల్లడించారు. గుమ్మలక్ష్మీపురానికి చెందిన నిమ్మల శివాజీ హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేసేవాడు. చెడు వ్యసనాలకు బానిసై ఆ ఉద్యోగాన్ని వదిలేసి స్వగ్రామానికి చేరుకున్నాడు. ఇక్కడ ద్విచక్ర వాహనాలను దొంగతనం చేయడానికి అలవాటు పడ్డాడు. టీ స్టాళ్లు, రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ కాంప్లెక్స్‌లు, దేవాలయాలు వంటి రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలను శివాజీ తన దగ్గర ఉన్న తాళాలతో ప్రయత్నించి అపహరించేవాడు. ఆ వాహనాలను రూ.3 వేలు నుంచి రూ.5 వేలుకు అమ్మేవాడు. ఆ డబ్బులతో జల్సాలు చేసేవాడు. ఈ చోరీలపై ఫిర్యాదులు అందడంతో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. నిందితుడిని గుర్తించడానికి టెక్నాలజీని వినియోగించారు. దీనిలో భాగంగా జిల్లాలో పలుచోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఓ వ్యక్తి గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురం కాంప్లెక్స్‌కు బస్సులో వచ్చి బైక్ చోరీకి ప్రయత్నిస్తున్నట్లు గమనించారు. అనంతరం చోరీకి గురైన ద్విచక్ర వాహనాల ప్రదేశాల వద్ద సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. బైక్‌లను అపహరిస్తున్నది గుమ్మలక్ష్మీపురానికి చెందిన శివాజీగా గుర్తించారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం ఆర్టీసీ కాంపెక్స్ వద్ద నిందితుడిని అరెస్టు చేశారు. శివాజీ నుంచి ఇప్పటి వరకు 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇతనిపై మూడు జిల్లాల్లో 13 కేసులు నమోదైనట్లు చెప్పారు. పార్వతీపురం పట్టణంలో 7 బైక్‌లు, సీతానగరం మండలంలో ఒకటి, విజయనగరం జిల్లాలో 4, విశాఖపట్నం జిల్లాలో ఒక ద్విచక్ర వాహనాన్ని దొంగతనం చేసినట్లు గుర్తించామన్నారు. ఈ పోలీసు స్టేషన్ల పరిధిలో శివాజీపై కేసులు నమోదై ఉన్నాయన్నారు. మిగిలిన 4 బైక్‌లకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈజీ మనీకి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. నిందితుడిని పట్టుకున్న సీసీఎస్ పోలీసులను, పార్వతీపురం పట్టణ సీఐ మురళీధర్‌ను అభినందించారు. కార్యక్రమంలో పార్వతీపురం ఏఎస్పీ అంకితా సురాన, సీసీఎస్ సీఐ అప్పారావు, ఏఎస్ఐ వెంకటేష్, పార్వతీపురం పట్టణ ఎస్ఐ గోవిందరావు తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ ఏరియా ఆసుపత్రికి మహర్దశ

- పీఎం 'ఆయుష్మాన్ భారత్'కు ఎంపిక
- రూ.23.75 కోట్లు కేటాయింపు
- ఏర్పాటుకానున్న క్రిటికల్ కేర్ బ్లాకు
- 50 బెడ్లు, ఐసీయూ విభాగం కూడా..

పాలకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఏరియా ఆసుపత్రికి మహర్దశ పట్టింది. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు ఎంపికైంది. ఈ పథకం కింద ఆస్పత్రి అభివృద్ధికి రూ.23.75 కోట్లు కేంద్రం కేటాయించనుంది. ఈ నిధులతో ఆస్పత్రిలో 50 బెడ్లు, అత్యాధునిక క్రిటికేల్ కేర్, ఐసీయూ విభాగాలు ఏర్పాటు కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఐదు ఆస్పత్రులకు క్రిటికల్ కేర్ బ్లాకులను మంజూరు చేసింది. దీనిలో భాగంగా ఏజెన్సీ ప్రాంతానికి ముఖద్వారంగా ఉన్న పాలకొండ ఏరియా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాకు ఏర్పాటుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనిద్వారా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులతో పాటు మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రజలకు అత్యాధునిక సదుపాయాలతో కూడిన వైద్య సేవలు అందనున్నాయి. అందుకోసం ఒక్కో యూనిట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.23.75 కోట్లతో భవనాలు నిర్మించనుంది. దీనిలో 50 బెడ్లు, అత్యాధునిక క్రిటికేల్ కేర్, ఐసీయూ విభాగాలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా అన్ని రకాల వైద్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అందించేలా చర్యలు చేపడుతున్నాయి. ఇప్పుడు క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుతో మరిన్ని అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

నిధులు మంజూరైన వెంటనే పనులు

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయనున్న రూ.23.75 కోట్లతో ఆసుపత్రి ప్రాంగణంలోనే అత్యాధునిక సదుపాయాలతో నూతన భవనం నిర్మించేందుకు వైద్యవిధాన పరిషత్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. వైద్య సిబ్బంది పాత క్వార్టర్స్‌ను తొలగించి, వాటి స్థానంలో ఈ నూతన భవనం నిర్మించేందుకు పరిశీలన చేస్తున్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే క్రిటికల్ కేర్ యూనిట్ భవన నమూనా ఇంజనీరింగ్ విభాగం అధికారులకు అందుబాటులోకి వచ్చినట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ గొర్లె నాగభూషణరావు మాట్లాడుతూ.. పీఎం ఆయుష్మాన్‌భారత్ పథకంలో భాగంగా ఏరియా ఆసుపత్రిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయని, త్వరలో భవన నిర్మాణం చేపట్టేందుకు ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిసిందని అన్నారు. ఇదిలావుండగా, కరోనా సమయంలో రాష్ట్ర ప్రభుత్వం పాలకొండ ఏరియా ఆసుపత్రిలో పది బెడ్ల ఐసీయూ యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చింది. కరోనా తర్వాత సిబ్బంది కొరతతో ఐసీయూని ఉపయోగించిన దాఖలాలు లేవు. ఇప్పుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న క్రిటికేల్ యూనిట్ ఏ విధంగా సేవలు అందిస్తుందో వేచి చూడాలి.



పాలకొండ ఆసుపత్రి

క్రమశిక్షణ, సన్మార్గానికి మారుపేరు రంజాన్

- ఇఫ్తార్ విందులో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు, సన్మార్గానికి మారుపేరు పవిత్ర రంజాన్ మాసమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో ఇఫ్తార్ విందు కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. జిల్లాలో ముస్లింలకు శ్మశాన వాటిక సమస్య ఉన్నట్టు మత పెద్దలు తమ దృష్టికి తీసుకొచ్చారని, త్వరలో సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డాక్టర్ ఆర్.ఎస్.జాన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎండీ గయాజుద్దీన్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, ఉర్దూ లైబ్రేరియన్ కుదుష్ పాల్గొన్నారు.

ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించాలి

జిల్లాలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉగాది వేడుకల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. స్థానిక లయన్స్ కల్యాణ మండపం వేదికగా ఈ నెల 30న ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా మామిడి తోరణాలు, అరటి చెట్లతో అలంకరణలు ఉండాలన్నారు. మంగళవాయిద్యాలు, పంచాంగ శ్రవణం, వేద పండితుల ఆశీర్వచనం, ఉగాది పచ్చడి, పులిహోరా వంటి ప్రసాదాల ఏర్పాట్లను దేవదాయశాఖ అధికారులు చూడాలన్నారు. ఈ సమావేశంలో జేసీ శోభిక, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఎంత మంది పిల్లలు ఉన్నా 'తల్లికి వందనం'

- సాలూరు మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.2 కోట్లు
- రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

2లో


మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

వేతనదారులకు వేసవి కష్టాలు

- 'ఉపాధి' పని ప్రదేశంలో కానరాని నీడ, తాగునీరు
- ముందస్తు చర్యలు చేపట్టని యంత్రాంగం

2లో

మండిన మన్యం

- జిల్లాలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- 11 మండలాల్లో వడగాల్పులు
- ఉక్కిరిబిక్కిరైన ప్రజలు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వాతావరణశాఖ


పాలకొండలో ఎండ నుంచి రక్షణకు గొడుగుతో వెళుతున్న మహిళలు

పాలకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగమంటున్నాడు. సూర్య ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో గురువారం 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. భానుడి దెబ్బకు పల్లె, పట్టణాల్లోని దుకాణాలు మూతపడుతున్నాయి. ప్రధాన రహదారులన్నీ బోసిపోయి కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. మూగజీవాలు సైతం ఎండ తీవ్రతను తట్టుకోలేక చెట్ల నీడకు చేరుతున్నాయి. పాలకొండ, పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట, మక్కువ, కొమరాడ, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, వీరఘట్టం మండలాల్లో వడగాల్పులు వీస్తున్నట్టు ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ఆర్.కూర్మనాథ్ హెచ్చరించారు. రానున్నరోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఈ వీణ.. ఆనంద రాగం పలికేనా?

- పనస కలప సమకూర్చాలని కళాకారుల డిమాండ్
- ఇక్కడి పరిసర ప్రాంతాల్లో తగ్గిపోయిన పంట
- ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించాలని వినతి
- శాసనసభలో ఎమ్మెల్యే ప్రస్తావన
- భవిష్యత్తుపై చిగురిస్తున్న ఆశలు

బొబ్బిలి పేరు చెబితే అక్కడి రాజుల పౌరుష.. పరాక్రమాలతో పాటు ఠక్కున గుర్తుకువచ్చేది ఇంకొకటి ఉంది. అదే ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన వీణ. వీణ తయారీకి ప్రధాన వనరైన పనస కలప ప్రస్తుతం దొరకడం గగనమవుతోంది. కళాకారుల విజ్ఞప్తి మేరకు ఇటీవల ప్రభుత్వం పనస కలపపై దృష్టి పెట్టింది. ఈ చెట్లను పెంచే దిశగా వడివడిగా అడుగులు వేయాలని వీరు కోరుతున్నారు.


వీణను తయారు చేస్తున్న కళాకారుడు



బొబ్బిలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి)

బొబ్బిలి వీణకు పనస కలప గండం పొంచి ఉంది. ఈ పరిసర ప్రాంతాల్లో పనస కలప దొరకడం కష్టమవుతోంది. ఇది లేకుంటే వీణలు తయారు చేయడం కష్టం. కనీసం ఇతర రాష్ట్రాల నుంచి కలపను సమకూర్చాలని చాలా సంవత్సరాలుగా వీణ కార్మికులు కోరుతున్నారు. తాజాగా ఎమ్మెల్యే బేబీనాయన శాసనసభ వేదికగా వీణల సమస్యను ప్రస్తావించారు. పనస కలప తమిళనాడు, కేరళ నుంచి తెప్పించేందుకు చొరవ తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించింది. ఇది కళాకారుల్లో ఆనందాన్ని నింపుతోంది.

ఇదీ చరిత్ర..

బొబ్బిలి వీణ పేరు దేశవిదేశాల్లో మార్మోగుతోంది. ఇక్కడ తయారైన వీణలు ఇతర రాష్ట్రాలు, దేశాల ప్రజల మదిని దోచాయి. వీటికి జాతీయ, అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది. విజయనగరం సంస్థానంలో సహాయ వడ్రంగిగా పనిచేసిన మునినాడ చిన్నయ్య నాడు నూజివీడు వెళ్లి వీణల తయారీలో మెలకువలను ఔపోసన పట్టారని చరిత్ర చెబుతోంది. ఆయన బొబ్బిలి ఆస్థాన వడ్రంగి అయిన రాయల వీరభద్రునికి వీణల తయారీ కళలో శిక్షణ ఇచ్చారు. బొబ్బిలి సంస్థానంలో 11వ రాజు మహారాజా శ్వేతాచలపతి రంగారావు అనుమతితో సర్వసిద్ధి అప్పలస్వామి, సర్వసిద్ధి సాంబన్నలకు వీణల తయారీ కళను నేర్పించారు. నాటి నుంచి తరువాత సంస్థానాధీశులు కూడా వీణల తయారీని ప్రోత్సహించారు. ఇందుకోసం పాత కోటలో ఓ గదిని వీణల తయారీ కళాకారులకు కేటాయించారు. 1994లో గొల్లపల్లికి చెందిన సర్వసిద్ధి రమణ మాస్టారు వాటా ధనాన్ని సమకూర్చడంతో అప్పటి రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దింటి జగన్మోహనరావు హస్తకళల అభివృద్ధి సంస్థ ద్వారా గొల్లపల్లిలో వీణల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. ఇక్కడి వీణలు నాటి అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్‌ను సైతం ఆకట్టుకున్నాయి. ఇంత పేరున్న పరిశ్రమకు కలప పూర్తిస్థాయిలో సమకూరక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పనసే ఎందుకంటే..

పనస కలపతో చేసిన వీణలు అందం, తేలిక గుణం సంతరించుకుంటాయి. పనస కలప కొరత కారణంగా వీణల తయారీని పూర్తి స్థాయిలో చేపట్టలేకపోతున్నారు. మరోవైపు పదేళ్ల క్రితం ఇచ్చిన యంత్రాలు, పనిముట్లకు కాలం చెల్లడంతో మూలకు చేరాయి. వీణల తయారీదారులకు అందుబాటులో ఉండేలా అటవీ ప్రాంతంలో పనస చెట్లను విరివిగా పెంచుదామని తాజాగా అసెంబ్లీలో మంత్రి సవిత చెప్పారు. ఒక పనస మొక్కను నాటితే... అది చెట్టుగా మారి వీణ తయారీకి ముడిసరుకుగా మారడానికి కనీసం పాతికేళ్లు పడుతుంది. అలా పనస కలప అందుబాటులోనికి వచ్చే వరకు తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో అందుబాటులో ఉన్న పనస కలపను వీణల తయారీకి సరఫరా చేయాలని కళాకారులు కోరుతున్నారు. గత ఏడాది అధికారులు వచ్చినప్పుడు అలజంగి విజ్ఞేశ్వరరావు అనే వృద్ధ కళాకారుడు తమ ఆవేదనను వెలిబుచ్చారు. సంగీత వీణలు తయారు చేయగల వృద్ధకళాకారులు అతి కొద్ది మంది మాత్రమే ఉన్నారని.. ముడి సరుకు (పనస చెట్టు కలప) లేకుండా ఎన్ని పథకాలు పెడితే ఏం లాభమని ప్రశ్నించా రు. అటవీ శాఖ ఆంక్షలతో పనస కలప తమకు లభ్యం కావడం లేదన్నారు. వృద్ధ కళాకారుల తరం అంతరించి పోతే సంగీత వీణల తయారీకి కళాకారులు దొరకడం కష్టమవుతుందని తెలిపారు. ఈ తరం వారిని తయారు చేయాల్సి ఉందని సూచించారు. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు.

శాసనసభలో చర్చించడం హర్షణీయం..

బొబ్బిలి వీణకు మరింత గుర్తింపు తీసుకురావాలని శాసనసభలో ఎమ్మెల్యే బేబీనాయన చర్చించడం హర్షించదగ్గ విషయం. పనస కలపను అందుబాటులోకి తెస్తే కళాకారులకు మరింత ఉపాధి దొరుకుతుంది. ఆధునిక శిక్షణ, పనిముట్లు, కలపను సరఫరా చేయాలి. బొబ్బిలి, గొల్లపల్లి, వాడాడ గ్రామాలకు చెందిన 50 మంది కళాకారులకు రూ.పదివేల విలువ చేసే కిట్లను గత ఏడాది పంపిణీ చేశారు. వీటి ద్వారా కళాకారులకు సమయం ఆదా అవుతోంది. అదేవిధంగా సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం గుర్తింపు కార్డులను జారీ చేస్తే ఇంకా బావుంటుంది.

-సర్వసిద్ధి రామకృష్ణ,
వీణల కేంద్రం ఇన్‌చార్జి


కళాకారులు తయారు చేసిన వీణలు


బొబ్బిలి వీణల తయారీ కేంద్రం

ఎంతమంది పిల్లలు ఉన్నా 'తల్లికి వందనం'

- మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.2 కోట్లు
- రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి


సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

సాలూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి కూడా తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయనున్నట్టు రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె నియోజకవర్గ స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, కుటుంబ సాధికార సారథులతో సమావేశం నిర్వహించారు. ముందుగా సీనియర్ కార్యకర్త ఆదాడ సత్తిబాబు మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గంలో 40,200 పార్టీ సభ్యత్వాలు చేసి ప్రథమ స్థానంలో నిలిచామని తెలిపారు. దీనికి సహకరించిన అందరికీ అభినందించారు. మున్సిపాల్టీలో అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు రూ.రెండు కోట్లు మంజూరు చేశారని చెప్పారు. రాష్ట్రంలో ఉచిత గ్యాస్ పథకం ద్వారా 98 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. జూన్ నెలలో పాఠశాలలు తెరిచే నాటికి ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధి చేకురుతుందని అన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రూ.20 వేలు జమ కానున్నాయని అన్నారు. కుటుంబ సాధికార సారథులు సమర్థంగా పనిచేయాలని ఆమె సూచించారు. ఈ నెల 29న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామాల్లో తప్పనిసరిగా నిర్వహించాలని కోరారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆరుగురికి రూ.8 లక్షల చెక్కులను ఆమె అందజేశారు. పార్టీ సభ్యత్వ కార్డులను నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి), మండల నాయకులు గుళ్ల వేణు, పరమేశ్, వెంకటరమణ, గుడేపు యుగంధర్, టీడీపీ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ముఖీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

12 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు..

మే నెలలో జరగనున్న సాలూరు గ్రామదేవత శ్యామలాంబ ఉత్సవానికి సంబంధించి ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఇప్పటికే అదనంగా 12 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని ఎస్ఈ చలపతిరావు మంత్రికి తెలిపారు. అవసరమైతే మరికొన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజలతో మాట్లాడారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలమాంబ ఆలయ హుండీల లెక్కింపు

మక్కువ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ అమ్మవారి 8, 9 వారాల జాతరకు సంబంధించి చదురుగుడి, వనం గుడి ఆలయాల హుండీలను గురువారం లెక్కించారు. చదురుగుడి హుండీల ద్వారా రూ.2లక్షల 94వేల 984, వనంగుడి హుండీల ద్వారా లక్షా 16వేల 204 రూపాయలతో కలిపి ఆదాయం రూ.4,11,188 వచ్చింది. జిల్లా దేవదాయశాఖాధికారి ఎస్.రాజారావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి వీవీ సూర్యనారాయణ, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ నైదాన తిరుపతిరావు, సర్పంచ్ వెదుళ్ల సింహాచలమ్మ, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భద్ర మహంకాళమ్మకు పూజలు



లక్కవరపుకోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్.కోటలోని భద్రమహంకాళమ్మకు గురువారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఏటా కొత్త అమావాస్యకు ముందు మూడు రోజుల పాటు అమ్మవారి పండగ నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. బుధవారం తొలేళ్ల ఉత్సవం, గురువారం అనుపోత్సవం అనంతరం ముగింపోత్సవం జరుగుతుంది. గురువారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం భారీ ఊరేగింపుతో అనుపోత్సవం నిర్వహించారు.


బి.సుమంత్ ఎన్.అనూరాధ

జాతీయ కబడ్డీ పోటీలకు జిల్లా క్రీడాకారులు

విజయనగరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఎన్.అనూరాధ, బి.సుమంత్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 28 నుంచి 31 వరకు బీహార్ రాష్ట్రంలో జరగబోయే జాతీయ సబ్ జూనియర్ బాల, బాలికల కబడ్డీ చాంపియన్‌షిప్‌కు జిల్లా నుంచి ఈ ఇద్దరు ఎంపికయ్యారు. వీరి ఎంపికపై కబడ్డీ జిల్లా సంఘం చైర్మన్ ఐవీపీ రాజు, అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగారావుదొర, కె.వి.ప్రభావతి, పీడీ సౌదామణి హర్షం వ్యక్తం చేశారు.



వేతనదారులకు వేసవి కష్టాలు

- 'ఉపాధి' పని ప్రదేశంలో కానరాని నీడ, తాగునీరు
- ఫలితమివ్వని తాత్కాలిక పందిళ్లు
- ముందస్తు చర్యలు చేపట్టని యంత్రాంగం

రాజాం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకం వేతనదారులకు వేసవి కష్టాలు వెంటాడుతున్నాయి. పని ప్రదేశంలో నీడ కోసం షామియానాలు, తాగునీరు వంటివి ఏర్పాటు చేయాల్సి ఉన్నా... చాలా చోట్ల సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఎండ తీవ్రత ఉంటోంది. మరోవైపు గత కొద్దిరోజులుగా జిల్లాలోని కొన్ని మండలాల్లో వడగాల్పుల తీవ్రత ఉంది. ఈ నేపథ్యంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో వేతనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

చురుగ్గా ఉపాధి పనులు..

జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులు జరుగుతున్నాయి. వ్యవసాయ పనులు లేకపోవడంతో వేతనదారులు ఎక్కువగా వస్తున్నారు. ప్రస్తుతం విజయనగరం జిల్లా వ్యాప్తంగా 65 వేల మంది వరకూ పనులకు హాజరవుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఎండ బాధ ఒక వైపు.. వేడిగాలులు మరోవైపు వేతనదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వేతనదారులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించింది. ముఖ్యంగా పని ప్రదేశాల్లో నీడకోసం టార్పాలిన్లు అందించేది. అప్పట్లో జిల్లాలో 7 వేలకుపైగా టార్పాలిన్లు అందించారు. చాలా ఏళ్లు కావడంతో అవి పాడయ్యాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వేతనదారులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. ఈ ఏడాది కూడా అధికారులు ఎటువంటి ఏర్పాట్లు చేయడం లేదు. దీంతో వేతనదారులే తాటి, కొబ్బరి కమ్మలతో తాత్కాలికంగా పందిళ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆ పాకల కింద వేతనదారులు తెచ్చుకున్న మంచినీటి సీసాలు, అల్పాహారం పెట్టుకోవడం తప్ప సేదతీర్చుకునే అవకాశం లేదు.

మంచినీరూ కరువే..

గతంలో పని ప్రదేశాల్లో మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి అందుబాటులో ఉంచేవారు. స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో వీటిని ఏర్పాటు చేసేవారు. కానీ ఈ ఏడాది ఎండలు మండుతున్నా.. వాటిని ఏర్పాటు చేయలేదు. దీంతో వేతనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వేతనదారులే ఇళ్ల నుంచి క్యాన్లలో నీటిని తరలిస్తున్నారు. మరోవైపు పని ప్రదేశాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు కూడా లేవు. గత ఏడాది వేసవిలో వడదెబ్బకు చాలామంది మృత్యువాత పడ్డారు. మరోసారి ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని వేతనదారులు కోరుతున్నారు.

సిబ్బందికి ఆదేశాలిచ్చాం..

పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు కల్పించాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ముఖ్యంగా నీడనిచ్చేందుకు షామియానాలు వేయాలని ఆదేశించాం. ఎండ తీవ్రత లేని సమయంలో మాత్రమే పనులు చేపట్టాలని సూచించాం. పని వేళలనూ మార్చాం. చెరువులలో కమ్మల శాలలు ఏర్పాటు చేయాలని ఆదేశించాం. ఎన్జీవోల ద్వారా మజ్జిగ, వైద్యాధికారుల ద్వారా ఓఆర్ఎస్, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేయించాలని ఏపీవోలకు చెప్పాం.

-శారదాదేవి, డ్వామా పీడీ, విజయనగరం

సీతంపేట ఏజెన్సీలో...


మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్న గిరిజనులు

సీతంపేట రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో ఉపాధి వేతనదారుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. నీరు, నీడ లేక పని ప్రదేశాల్లో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. 2017-18 మధ్య కాలంలో ఉపాధి కూలీలకు నీడ కోసం టెంట్లు, మంచినీటి సౌకర్యం, పనిముట్లు, ప్రథమ చికిత్స కిట్లతో పాటు మజ్జిగ వంటివి అందించారు. అప్పట్లో 1,625 శ్రమశక్తి సంఘాలకు వీటిని అందజేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఉపాధి వేతనదారుల కష్టాలను గుర్తించలేదు. సొంత డబ్బులతో పనిముట్లను కొనుక్కొని గిరిజనులు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో లేకపోవడంతో పనుల సమయంలో దెబ్బలు తగిలినపుడు అవస్థలకు గురవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం వేతనదారుల కష్టాలను గుర్తించి ఉపాధి పనుల వేళల్లో స్వల్ప మార్పులను తీసుకువచ్చింది. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 5 వరకు ఎండకు దొరకకుండా పనులు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఇది కొంతలో కొంత ఊరటనిస్తోంది. గతంలో ఉపాధి పనుల వద్దకు చిన్న పిల్లలను తీసుకువస్తే వారిని ఆడించేందుకు ఆయాలను అందుబాటులో ఉంచేవారు. ఇప్పుడు ఈ పరిస్థితి లేకపోవడంతో చిన్నారులతో తల్లులు ఇబ్బందులకు గురవుతున్నారు.

వెంటాడుతున్న సమస్యలు

మండలంలో 1000 వరకు శ్రమశక్తి సంఘాలు పనులను చేస్తున్నాయి. వీరికి రోజు వారి ఉపాధి వేతనం రూ.257 వరకు వస్తోంది. పనులు చేసే చోట మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో వేతనదారులు వడదెబ్బకు గురై ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. గడచిన పది వారాలుగా కూలీలకు వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. దీంతో వేతనాలు తమ బ్యాంక్ ఖాతాలకు ఎప్పుడు జమ అవుతాయోనని ఆశతో ఎదురుచూస్తున్నారు ప్రభుత్వం స్పందించి మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు వేతనాలను చెల్లించాలని వీరంతా కోరుతున్నారు.

బకాయిలు రూ.కోట్లలోనే...

ఉపాధి వేతనదారులు ఇటీవల చేసిన భూ అభివృద్ధి, టెర్రాసింగ్, ఫార్మ్‌పాండ్ వంటి 150 పనులకు చెల్లించాల్సిన వేతన బకాయిలు రూ.కోటికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. మెటీరియల్ కాంపోనెంట్ కింద మారుమూల గిరిజన గ్రామాలకు నిర్మించిన సీసీ రహదారులు, హార్టికల్చర్ తదితర 200కు పైగా పనులు జరగడంతో వాటికి చెల్లించాల్సిన బకాయిలు మరో రూ.3.5 కోట్ల వరకు ఉన్నట్లు సమాచారం. సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో గిరిజన కూలీలు ఇబ్బందులు పడుతన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో పనులు చేస్తున్న గిరిజన వేతనదారులకు పనిచేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలని గిరిజన సంఘ నాయకులు బిడ్డిక అప్పారావు డిమాండ్ చేశారు. వేతనదారులు వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోతే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు.

పది రోజుల్లో చెల్లిస్తాం..

వేతనదారులకు ఇంకా వేతనాలు చెల్లించాల్సి ఉందని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ శ్రీహరి తెలిపారు. మరో పది రోజుల్లో చెల్లించనున్నట్టు చెప్పారు. ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశాల్లో టెంట్లు, పనిముట్లు, మంచినీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కిట్ల కోసం ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. ఉపాధి వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ప్రభుత్వం పనివేళల్లో మార్పులు చేసిందని చెప్పారు.

3న ఉద్యోగావకాశాలపై సదస్సు

శ్రీకాకుళం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య రంగాల్లో నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలపై వచ్చే నెల 3న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం రాగోలులో జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ముఖ్యఅతిథిగా కిమ్స్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు హాజరుకానున్నట్టు తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు వైద్య, ఆరోగ్య రంగంలో విస్తృత ఉద్యోగ అవకాశాలపై ఈ సదస్సులో వెల్లడిస్తారని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు గూగుల్ లింక్‌లో తమ పేర్లను వచ్చే నెల 2వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 ఫోన్ నెంబర్లలో గాని, నేరుగా రాగోలులో జెమ్స్ వైద్య కళాశాలలో గల బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థ ప్రతినిధులను సంప్రదించాలని కోరారు.

నేడు కవి గాయక సమ్మేళనం

విజయనగరం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కవిగాయక సమ్మేళనం జరుగుతుందని సాహితీ స్రవంతి ప్రతినిధి చీకటి దివాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సాహితీ, సంగీత, రచయిత, కళాకారులు, వివిధ వర్గాల్లో ప్రతిభావంతులైన పలువరు కవిగాయక సమ్మేళనంలో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమాన్ని పాయల మురళీకృష్ణ, కొత్తుర్తి శ్రీనివాసరావు, సీహెచ్ శ్యామల తదితరులు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

ఆశీలు పాట ఖరారు

గజపతినగరం, మార్చి27 (ఆంధ్రజ్యోతి) గజపతినగరం పంచాయతీలో రోజువారీ ఆశీలు వేలం పాట గురువారం ఖరారైంది. స్థానిక సచివాలయంలో సర్పంచ్ నరవకొండమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశీలు పాటను అదే గ్రామానికి చెందిన బూర్లి లక్ష్మి దక్కించుకున్నారు. ప్రభుత్వం పాట రూ.2 లక్షలు కాగా బూర్లి లక్ష్మి రూ.2 లక్షలకు రూ.వెయ్యి అదనంగా వేసి పాటను దక్కించుకున్నారు. ఏడాది కాలపరిమితిగా నిర్ణయించారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు గుర్తింపు

వేపాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చేపట్టిన ఉపాధి పనుల్లో రూ.55 లక్షల వరకు తేడాలు ఉన్నట్టు అధికారులు తేల్చారు. గురువారం మండల కేంద్రంలో ఉపాధి పనుల సామాజిక వేదికను నిర్వహించారు. ఏయే గ్రామాల్లో అవకతవకలు జరిగాయే అధికారులు స్పష్టం చేశారు. అలాగే 100 రోజుల పని కల్పించనందుకు రూ.22 వేల జరిమానాను విధించారు. సామాజిక తనిఖీలో ఎస్ఆర్పీ లక్ష్మణరావు, డీఆర్పీలు రవి, వినోద్, ఎ.మధు, ఏపీడీ కె.రమామణి, ఎంపీడీవో సిహెచ్.సూర్యనారాయణ, ఏపీవో ఆదిలక్ష్మి, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జడ్పీటీసీ సభ్యుడు ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు

రోడ్డు పనుల పరిశీలన

వేపాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆతవలో తారురోడ్డు పనులను గురువారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో రహదారి పనులు నిలిపేసిన సంగతి తెలిసిందే. స్థానికుల ఆందోళనల నేపథ్యంలో పనులు పూర్తి చేయిస్తానని గతంలో ఎమ్మెల్సీ మాటిచ్చారు. అందుకు తగ్గట్టు పనులు జరుగుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

నేటినుంచి రుణ లబ్ధిదారుల ఎంపిక

నెల్లిమర్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం నుంచి బీసీ కార్పొరేషన్ రుణ లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఎంపీడీవో కే.రామకృష్ణరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 28న, ఏప్రిల్ 2న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణ లబ్ధిదారుల ఎంపిక చేస్తామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భోగాపురం, మార్చి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ మస్తాన్‌వలీ గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో కొంగవానిపాలెం, మెట్టసబ్బన్నపేట, నందిగాం, తోటపల్లి, దిబ్బలపాలెం, చేపలకంచేరు, బమ్మిడిపేట, గాబువానిపేట, కొండ్రాజుపాలెం, రామచంద్రపేట గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తామన్నారు.

రేపు టీడీపీ సీనియర్లకు సన్మానం

శృంగవరపుకోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అవిర్భావం దినోత్సవం సందర్భంగా శనివారం ఆ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలను సన్మానిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు తెలిపారు. ఎమ్మెల్యే లలితకుమారి సూచన మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

శైలజ, సుధాకర్‌కు జీవిత సాఫల్య పురస్కారం

● గురునారాయణ కళాపీఠం ప్రకటన



ఆహ్వానపత్రాలు చూపుతున్న కళాపీఠం వ్యవస్థాపకుడు, ప్రతినిధులు

విజయనగరం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నేపథ్య గాయనీ ఎస్పీ శైలజ, సినీనటుడు శుభలేఖ సుధాకర్‌కు గురునారాయణ కళాపీఠం తరఫున జీవిత సాఫల్య పురస్కారం అందజేయనున్నామని కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ గాయకుడు బి.ఎ.నారాయణ తెలిపారు. ఏప్రిల్ 1న నగరంలోని ఆనందగజపతి కళాక్షేత్రంలో కళాపీఠం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పురస్కారాన్ని ప్రదానం చేయనున్నామన్నారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాపీఠం వార్షికోత్సవంలో భాగంగా ఇంతవరకూ లలిత సంగీత దర్శకుడు బండారు చిట్టిబాబు, సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, మధుర గాయని పి.సుశీల, సంగీత దర్శకుడు మణిశర్మలకు ఈ పురస్కారాలు ప్రదానం చేశామన్నారు. ఈ ఏడాది శైలజ, సుధాకర్‌లతో పాటు తబలా విద్వాంసుడు బగ్గాం ధనుంజయ్‌ను కళాపీఠం ఆధ్వర్యంలో సత్కరించనున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ గాయని పద్మభూషణ్ పి.సుశీల పాల్గొంటారన్నారు. సమావేశంలో కళాపీఠం అధ్యక్షురాలు సన్యాసమ్మ, హోటల్ మయూర అధినేత యార్లగడ్డ బాబురావు, ప్రతినిధులు పద్మావతి, మారుతి శ్రీనివాసరావు, వైవీవీ సత్యనారాయణ, సురభి శ్రావణి, సీహెచ్ రామచంద్రశేఖర్, చీకటి చంద్రిక, ఎస్.సూరినాయుడు, బి.నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మతల్లి తీర్థం



ఆలయం వద్ద భక్తుల సందడి

జామి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్రంగి లో గ్రామదేవత బంగారమ్మతల్లి తీర్థమహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని తాండ్రంగి సర్పంచ్ కరక వందన, దశరథ్ దంపతులు, జనసేన నేత పోలిపర్తి చిన్నంనాయుడు తదితరులు దర్శించుకున్నారు. పండగ సందర్భంగా ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. పెత్తఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఫ్యాపిటో నూతన కార్యవర్గం ఎన్నిక

విజయనగరం దాసన్నపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని యూత్ హాస్టల్‌లో ఫ్యాపిటో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. ఫ్యాపిటో సెక్రటరీ జనరల్, రాష్ట్ర పరిశీలకుడు ఎస్.చిరంజీవి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఏపీటీఎఫ్ ప్రతినిధి పాలతేరు శ్రీనివాస్, కోచైర్మన్‌గా లోపింటి శివప్రసాదరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఈశ్వరరావు, కార్యదర్శిగా వంకల రమణ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులతో రాష్ట్ర పరిశీలకులు చిరంజీవి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి

విజయనగరం దాసన్నపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సమస్యలపై ఏప్రిల్ 1న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నా అందరూ విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన దుప్పాడ, జొన్నవలసల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్న చెరువుల వద్ద కూలీలను కలిసి ప్రచారం నిర్వహించారు. తొమ్మిది వారాలకు పైగా ఉపాధి బిల్లులు బకాయిలు ఉన్నాయని, నెలల తరబడి ఉపాధి హామీ బిల్లులు చెల్లించకపోవడంతో కూలీల్లో పనిపై ఆసక్తి తగ్గిపోతోందన్నారు. గతంలో మజ్జిగ, నీరు, టెంట్లు ఏర్పాటు చేసేవారని, పారలు, గునపాలు, తట్టలకు డబ్బులు గ్రామం నుంచి చెరువుకు వుండే దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలు ఇచ్చేవారని, ప్రస్తుతం అమలు చేయడం లేదన్నారు.

వక్ఫ్‌బోర్డు చట్టాన్ని వెనక్కి తీసుకోండి

విజయనగరం రింగురోడ్డు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని ఏపీసీసీ మైనార్టీ వైస్ చైర్మన్ ఎండీ హుస్సేన్ షరీఫ్ డిమాండ్ చేశారు. గురువారం తోటపాలెంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మసీదులు, దర్గాలు, భూములు లాక్కునే ప్రయత్నంలో భాగంగా ఈ చట్ట సవరణను చేయడం జరిగిందని ఆరోపించారు. తక్షణమే వక్ఫ్‌బోర్డు చట్టాన్ని వెనక్కి తీసుకోక పోతే దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌కె సమీర్, ఎ.రెహ్మాన్, తిరుపతిరావు, దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసర్వేతో రైతులకు పూర్తిహక్కు

రేగిడి, మార్చి 27, (ఆంధ్రజ్యోతి): భూరీసర్వేతో రైతులకు పూర్తిహక్కులు కల్పిస్తామని, ఇందుకు రైతులు పూర్తి ఆధారాలతో ముందుకు రావాలని జిల్లా సర్వేలాండ్ రికార్డు అధికారి రమణమూర్తి, చీపురపల్లి ఆర్డీవో సత్యవాణి అన్నారు. మండలంలో అంబఖండిలో గురువారం భూరిసర్వేపై రైతులతో రెవెన్యూశాఖ గ్రామసభ నిర్వహించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు చిన్నారావు, సర్పంచ్ శాసపు గోవిందనాయుడు ఉన్నారు.

జూనియర్ సివిల్ న్యాయాధికారిగా నైమిష



న్యాయాధికారి నైమిష

రాజాం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాజాం జూనియర్ సివిల్ న్యాయాధికారిగా కెంబూరు నైమిష గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ జూనియర్ సివిల్ న్యాయాధికారి కృష్ణ సాయితేజకు సీనియర్ సివిల్ న్యాయాధికారిగా పదోన్నతి రావడంతో జూనియర్ సివిల్ న్యాయాధికారి పోస్ట్ ఖాళీ అయ్యింది. దాంతో నైమిషను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

తప్పులు లేని ఓటరు జాబితాకు కృషి

భోగాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు బూత్‌లెవెల్ అధికారులు నిరంతరం కృషి చేయాలని తహసీల్దారు ఎం.సురేష్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు వి.వి.ఆర్.జగన్నాథరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

శృంగవరపుకోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సతీశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సండి సోమేశ్వరరావు అధ్యక్షతన జరుగుతుందన్నారు.

ఎక్కల దేవతమ్మ ఉత్సవంలో కోండ్రు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొగిరి గ్రామంలో నిర్వహిస్తున్న ఎక్కల దేవతమ్మ ఉత్సవంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గురువారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నాయకులతో చర్చించారు. అనంతరం ఇటీవల గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్న సోపేరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కోటగిరి సూర్యరావును ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుమల మన్మథరావు, జడ్డు విష్ణుమూర్తి, గురవాన నారాయణరావు, కిమిడి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీలు, మోసాలపై దృష్టి సారించండి



వినతిపత్రం అందజేస్తున్న భీశెట్టి బాబ్జీ

విజయనగరం దాసన్నపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో కల్తీలు, మోసాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పౌరవేదిక జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. గురువారం తూనికలు, కొలతల శాఖ సహాయ నియంత్రికుడు టీవీ రంగారెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో ఒక పెట్రోల్ బంకు యాజమాని వినియోగదారులు అక్రమంగా దోచుకున్న తీరును సోషల్ మీడియాలో ప్రముఖ టీవీ చానల్‌లో చూసిన వినియోగదారులు విస్తుపోతున్నారన్నారు. అటువంటి ఘటనలు జిల్లాలో జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు రామచంద్రరాజు, రామ్మోహన్ తదితరులున్నారు.

బాలికలకు వసతి కల్పించండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మోడల్ స్కూళ్లలో 6వ తరగతి నుంచి బాలికలకు వసతి సౌకర్యం కల్పించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బుకారిబాబు, పి.శ్రీనివాస్ కోరారు. మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ తహిరా సుల్తానాను గురువారం ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో బాలికల విద్యకు ఉపయోగపడుతుందన్నారు మోడల్ స్కూళ్లలో 9వ తరగతి నుంచి మాత్రమే వసతి కల్పిస్తుండటంతో దీంతో 6వ తరగతిలో ప్రవేశానికి బాలికలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మోడల్ స్కూళ్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ విడుదల చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఏకగ్రీవంగా వైస్ ఎంపీపీ ఎన్నిక



ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

భోగాపురం, మార్చి27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం వైస్ ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవం అయినట్టు ప్రిసైడింగ్ అధికారి, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆర్.వెంకటరమణ ప్రకటించారు. వైసీపీకి చెందిన భోగాపురం-1 ఎంపీటీసీ సభ్యురాలు పచ్చిపాల నాగలక్ష్మి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. మండలంలో వైసీపీకి 16 ఎంపీటీసీ సభ్యులు, టీడీపీకి ఆరుగురు, జనసేనకి ఒక్కరే ఉన్నారు. ఈనేపథ్యంలో వైస్ ఎంపీపీ ఎన్నికకు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు 9 మంది హాజరు కావడంతో వైస్ ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవమైంది. నాగలక్ష్మికి ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గాయత్రి, తహసీల్దారు ఎం.సురేష్, తదితరులు పాల్గొన్నారు. ఎన్నికైన వైస్ ఎంపీపీ పచ్చిపాల నాగలక్ష్మిని ఎంపీపీ ఉప్పాడ అనూష వైసీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి సత్కరించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ రమణ

గజపతినగరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ జి.ఎ.వి.రమణ అన్నారు. గురువారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ప్రపంచ ఆర్యవైశ్య మహసభ జిల్లా అధ్యక్షుడు పూసర్ల మోహన్ అధ్యక్షతన ఉగాది సందర్భంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల మాయమాటలకు లోబడి మోసపోవద్దన్నారు.వ్యాపారస్తులు రాత్రి సమయాల్లో వాచ్‌మేన్ లేదా సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కుసుమంచి సుబ్బారావు తదితరులున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



రమేశ్ (ఫైల్)

విజయనగరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పురుగు మందు తాగివిజయనగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్ల మండలంలోని నాగళ్లవలస గ్రామానికి చెందిన సంబరి రమేశ్ (48)గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. రెండు రోజుల కిందట రమేశ్ పురుగు మందు తాగాడు.భార్య ఉమాదేవికి విషయం చెప్పడంతే ఆమె అందరినీ పిలిచి విజయనగరం ఆసుపత్రికి తరలించింది. రెండు రోజుల పాటు మృత్యువుతో పోరాడి రమేశ్ తుది శ్వాస విడిచాడు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే గుర్ల మండలంలోని నాగలవలసలో రమేశ్.. భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నారు.సరైన జీవనాధారం లేకపోవడంతో కారు డ్రైవర్‌గా, పాలవ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తూ గుర్లలో టిఫిన్ దుకాణం నడిపేవాడు. ఏవీ కలిసి రాకపోవడంతో చాలాచోట్ల అప్పులు చేశాడు.అవి తీర్చలేక ఇబ్బంది పడేవాడు. అప్పులుతీర్చే దారిలేకతాను చనిపోతే బాగుండునని పదేపదే ఇంట్లో అంటుండేవాడట. నెలరోజుల కిందట భార్యతో పాటు ద్విచక్రవాహనంపై వెళ్తా చుక్కపేట సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడ్డారు. అప్పట్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ముఖ్యంగా రమేశ్‌కు కాలు, చేయి, తలపై దెబ్బలు తగిలాయి. ప్రస్తుతం మంచానికి పరిమితమయ్యారు. నానాటికీ ఆర్థిక ఇబ్బందులు పెరుగుతుండటంతో రెండురోజుల పురుగు మందు తాగాడు. మృతుడి భార్య ఉమాదేవి అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఇద్దరు పిల్లలు సూర్యశర్మ, హైమావతి ఉన్నారు. రమేశ్ మృతిపై పోలీసుల కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం గ్రామానికి చెందిన సింగారపు మహేష్ (37) విశాఖపట్నం కేజీహెచ్‌సీలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. మహేష్‌కు మద్యం తాగే అలవాటు ఉండటంతో భార్య పార్వతి, తల్లి గౌరమ్మ తరచూ మందలించేవారు. మహేష్ ఈనెల 25న ఆలస్యంగా ఇంటికి రావడంతో.. భార్య, తల్లి ఎప్పటిలాగే మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఆయన గడ్డి మందు తాగి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన భార్య, తల్లి.. పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై ఎస్ఐ ఎం.రాజేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

14మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

జామి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్రంగి గ్రామానికి చెందిన 14 మందిపై గురువారం సాయంత్రం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వీరజనార్దన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తలి గౌరినాయుడు ఇంటికి వెళ్లేదారిలో కారు రాకుండా సీసీ రోడ్డుపై వడిసిల కోటరావు, అతడి కుటుంబ సభ్యులు అడ్డుగా రాతితో నిర్మాణాలు చేశారన్నారు ఆటోలు అడ్డుపెట్టారన్నారు. బాధితుడు గౌరినాయుడు పలుసార్లు ప్రశ్నిస్తే దుర్భాషలాడుతూ దాడికి యత్నించారన్నారు. ఈనెల 23న రాత్రి 7 సమయంలో 14 మంది దారికాసి కత్తితో దాడికి ప్రయత్నించి కులం పేరుతో దూషించారని తెలిపారు. యాసిడ్ పోసి తగలేస్తామని వీధిలలోకి రాకుండా చేస్తామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు. బాధితుడి ఫిర్యాదుపై కోటరావుతో పాటు అతడి కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు,

ఆక్రమణల పరిశీలన



ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దారు

వేపాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం వేపాడ గ్రామంలో ఆక్రమిత స్థలాలను గురువారం తహసీల్దారు జె.రాములమ్మ పరిశీలించారు. వేపాడలో ఆక్రమణలపై కొందరు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో తహసీల్దారు సర్వే చేయించారు. మంచినీటి కోనేరు గట్టుపై వేసిన సీసీ రోడ్డు నిర్మాణంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్ఐ రామలక్ష్మి, సర్వేయర్ గంగాధర్, వీఆర్వో అప్పరాం, గ్రామపెద్దలు ఉన్నారు.

గంజాయిపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న రూరల్ సీఐ ఉపేంద్రరావు

రాజాం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గంజాయిని నియంత్రించడంతో పాటు కేసులు దర్యాప్తు సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు స్పష్టం చేశారు. ఇక్కడి రూరల్ స్టేషన్‌లో ఏపీపీ విజయలక్ష్మితో కలిసి రూరల్ సర్కిల్ పరిధిలోని మూడు మండలాల ఎస్ఐతో ఆయన గురువారం సమావేశమయ్యారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. కేసుల దర్యాప్తునకు సంబంధించి పకడ్బందీగా అనుసరించాల్సిన విధానంపై ఎస్ఐలకు అవగాహన కల్పించారు. సమావేశంలో రేగిడి ఎస్ఐ నీలావతి, సంతకవిటి ఎస్ఐ గోపాలరావు తదతరులున్నారు.


అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బెలగాం/పార్వతీపురం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పార్వతీపురం ఐసీడీఎస్ పీవో శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మండలం వీఆర్‌పేట, చినబొండపల్లి, బాలగుడబ గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు, అదేవిధంగా సీతంపేట మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. వచ్చే నెల 4 తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వీఆర్‌పేట ఓసీ కేటగిరికి, సీతంపేట ఎస్టీ, చినబొండపల్లి బీసీ-డికి, బాలగొడబ ఎస్సీ కేటగిరికి కేటాయించారని వెల్లడించారు.

● సాలూరు రూరల్: సాలూరు మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి కోరారు. ఆమె బుధవారం విలేకర్లతో మాట్లాడారు. సాలూరు మండలం కురుకూటి ఒకటి, దత్తివలస కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎం.కొత్తవలస, బందపాయిలో మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎగువ మెండంగి, చిన ఊటగెడ్డలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కురుకూటికి, బందపాయి, చిన ఊటగెడ్డ ఓసీలకు, ఎగువమెండంగి, ఎం.కొత్తవలసలు ఎస్టీ(నోటిఫైడ్)లకు, దత్తివలస బీసీ ఏకు కేటాయించారని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 21 నుంచి 35 ఏళ్లలోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులివ్వాలన్నారు. దరఖాస్తులను పోస్టు ద్వారా గానీ, నేరుగా సాలూరు సీడీపీవో కార్యాలయానికి గానీ వచ్చే నెల 4 లోపల అందజేయాలన్నారు.

● గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గడవంకదార గ్రామంలో ఒక అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, దేరువాడ, బొడ్డంకర్ల గ్రామాల్లో ఆయా పోస్టులను భర్తీ చేయనున్నట్టు భద్రగిరి ఐసీడీఎస్ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. ఈమేరకు గురువారం ఆమెఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మూడు పోస్టులను ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించామని చెప్పారు. అర్హతగల అభ్యర్థులు కార్యాలయానికి దరఖాస్తులు అందజేయవచ్చునని తెలిపారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న డీఎంవో

సీతంపేట రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో మలేరియా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ అన్నారు. గురువారం దోనుబాయి, కుసిమి పీహెచ్‌సీని సందర్శించి వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంవో మాట్లాడుతూ మలేరియా వ్యాప్తి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సీతంపేట ఏజెన్సీలో మలేరియా మరణాలు లేకుండా చూడాలని వైద్యాధికారి భానుప్రతాప్‌ను ఆదేశించారు. డీఎంవోతో పాటు కుసిమి పీహెచ్‌సీ వైద్యాధికారి చాందిని, వైద్య సిబ్బంది ఉన్నారు.

పట్టపగలే కలప అక్రమ రవాణా



వెంకటరమణపేట వద్ద నెంబర్‌ప్లేట్ లేని వాహనంలో కలప రవాణా

శృంగవరపుకోట రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలప స్మగ్లర్ల ఆగడాలకు అడ్డులేకుండా పోతోంది. సంబంధిత శాఖ జాడ పెద్దగా లేకపోవడంతో పట్టపగలే కలపను అక్రమంగా మిల్లులకు తరలుతోంది. నెంబర్ ప్లేట్లు లేని వాహనాల ద్వారా దర్జాగా కలపను అక్రమార్కులు తరలిస్తున్నారు. మండలంలోని పలు సా మిల్లుల వద్ద రికార్డుల్లో లేని కలప అధికంగా ఉన్నా సంబంధిత అధికారులు అటు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అటవీ శాఖ అధికారులు అక్రమార్కులను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

అసంపూర్తిగా భవన నిర్మాణం



అసంపూర్తిగా నిలిచిన రైతు భరోసా కేంద్రం

భోగాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం భోగాపురంలో రైతు భరోసా కేంద్రం పనులు అసంపూర్తిగా నిలిచి ఉన్నాయి. ఫ్లోరింగ్ మినహా దాదాపు అన్ని పనులు పూర్తయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో భవనం పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పర్యవసానంగా పనులు నేటికీ అసంపూర్తిగా ఉన్నాయి. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రం భవనం కొనసాగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతు భరోసా కేంద్రం పనులు పూర్తి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

వీరఘట్టం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మేజర్ పంచాయతీలో పూర్తిస్థాయిలో తాగునీరు అందజేయాలని కోరుతూ స్థానిక మహిళలు పంచాయతీ కార్యాలయం ముందు గురువారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మేజర్ పంచాయతీ అయినప్పటికీ గ్రామంలో పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదన్నారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదని, వీధుల్లో రోడ్లు గుంతల మయంగా మారాయన్నారు. అనంతరం పంచాయతీ ఇన్‌చార్జి ఈవో కోటేశ్వరరావు, ఎంపీడీవో బి.వెంకటరమణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర, నాయకుడు సింహాచలం పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



బాధితులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యు.వెంకమ్మపేట గ్రామానికి చెందిన వారాడ ఇందిరమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.88,652 చెక్కును ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గురువారం అందించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



బాధితురాలికి సాయం అందిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి కోవెలవీధిలో ఉంటున్న ఒంటరి మహిళ ముగడ జయమ్మ ఇల్లు బుధవారం అగ్ని ప్రమాదానికి గురయ్యింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం ఘటనా స్థలానికి వెళ్లి బాధితురాలికి పరామర్శించారు. 25 కిలోల బియ్యం, నగదు, నిత్యావసర సరుకులను అందించారు. ఆమె వెంట తహసీల్దార్ శేఖర్, నాయకులు కొండయ్య, కోలా రంజిత్‌కుమార్, శ్రీరామ్మూర్తినాయుడు, రాజేష్, అనీల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఎన్జీవోల సేవలు అభినందనీయం

సీతంపేట రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ సహకారంతో వాసన్ సంస్థ మూడేళ్ల పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టింది. వీటిలో లబ్ధిపొందిన రైతులతో గురువారం నౌగూడ గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీవో పాల్గొని, మాట్లాడారు. వాసన్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలతో గిరిజన కుటుంబాలు మరింత అభివృద్ధి చెందాలని అన్నారు. సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉద్యమ్'పై అవగాహన కల్పించాలి

పార్వతీపురంటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, ఆర్పీలే ఔత్సాహికులకు అవగాహన కల్పించాలని జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారులు బి.కళింగ వర్ధన్, దిలీప్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో మెప్మా ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఆర్పీలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్లపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 2,900ల మంది ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. సీఎంఎం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వడ్రంగులంతా ఐకమత్యంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న యూనియన్ సభ్యులు

పార్వతీపురంటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వడ్రంగులంతా ఐకమత్యంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.శంకరరావులు పిలుపునిచ్చారు. గురువారం కార్పెంటర్స్ డే సందర్భంగా యూనియన్ సభ్యులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కంగటి వారి కూడలి వద్ద వేడుకలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

లక్ష్యాలను చేరుకుంటాం

పార్వతీపురంటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల లక్ష్యాలను చేరుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మున్సిపాల్టీలోని 30 వార్డుల్లో ఇంటి పన్నుల వసూళ్లకు సంబంధించి ఆయన గురువారం ప్రత్యేక పర్యవేక్షణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25కి గాను ఇంటి పన్నుల లక్ష్యం రూ.5.57 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.4.37 కోట్లు వసూలు చేశామని, ఇంకా మిగిలిన మొత్తాన్ని వసూలు చేసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మార్చి 31వ తేదీ లోగా ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను చెల్లించే యాజమానులకు 50 శాతం వడ్డీ మాఫీ చేస్తామన్నారు.

● అన్నా క్యాంటీన్ల ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. గురువారం ఉదయం ఆయన స్థానిక అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

పాలకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక సంఘాలు, కార్పొరేషన్‌లో ఉన్న అన్ని విభాగాలు మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ.. ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మార్చి 31 వరకు జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమాలకు సంబంధించి కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. మున్సిపల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

గరుగుబిల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని నాగురు ఎంపీటీసీ సభ్యుడు, టీడీపీ అరకు పార్లమెంటరీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ సూచించారు. గురువారం చిలకాం పంచాయతీ పరిధిలో మహిళా సంఘాలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రూపులకు మరిన్ని సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం సీఆర్పీల నియామకం చేపడుతోందని తెలిపారు.

నేలబావే దిక్కు

● రక్షిత తాగునీటి పథకం లేని నారంనాయుడువలస

● అవస్థలు పడుతున్న గ్రామస్థులు

బలిజిపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామస్థుల తాగునీటి అవసరాలకు నేలబావే దిక్కు.. వారి పూర్వికుల నుంచి ఇప్పటి వరకూ ఆ గ్రామంలో తాగునీటి రక్షిత పథకమే లేదు. ఇదీ బలిజిపేట మండలానికి శివారులో ఉన్న నారంనాయుడువలస గ్రామం పరిస్థితి. గ్రామంలో సుమారు 1,300 మంది నివసిస్తున్నారు. వీరంతా రక్షిత తాగునీటి పథకం లేక పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామంలో ఉన్న నేల బావిపైనే ఆధార పడుతున్నారు. కలుషితమైన నీటిని తాగడంతో రోగాల బారిన పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రక్షిత తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని అధికారులకు విన్నవించుకున్నా ఎలాంటి ఫలితం లేదని వారు ఆందోళన వ్యక్త చేస్తున్నారు. వేసవిలో తమ పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందన్నారు. గ్రామంలో ప్రభుత్వ చేతి పంపులు ఉన్నా వాటిలో కొన్ని సక్రమంగా పని చేయడం లేదన్నారు. అధికారులు స్పందించి తమ గ్రామానికి రక్షిత మంచినీటి పథకాన్ని మంజూరు చేసి, కుళాయిలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

జలజీవన్ మిషన్‌లో భాగంగా ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే నారంనాయుడువలసలో పనులు ప్రారంభించి ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేస్తాం.

- పవన్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ



నేలబావి నుంచి నీటిని తోడుతున్న మహిళలు

ఏనుగుల జోన్ వద్దు

● పనులు అడ్డుకున్న సీపీఎం నాయకులు

సీతానగరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపటివలస సమీపంలోని అమ్మాదేవి కొండ పరిధిలో చేపడుతున్న ఏనుగుల జోన్ పనులను ఆయా గ్రామాల ప్రజలతో పాటు సీపీఎం నాయకులు గురువారం అడ్డుకున్నారు. గిరిజనులు, దళితులు సాగు చేస్తున్న భూములకు రక్షణ కల్పించాలని, అలాగే ఎఫ్ఆర్‌వో, డిపట్టా భూములకు నష్ట పరిహారం ఇప్పించి బాధితులకు న్యాయం చేయాలని సీపీఎం నాయకుడు మూడడ్ల కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఎటువంటి అరెస్టులు, కేసులకు భయపడి వెనక్కి తగ్గేది లేదన్నారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు బి.రామనరేష్ మణికంఠేష్, మనోజ్, తహసీల్దార్ ప్రసన్న, రూరల్ సీఐ గోవిందరావు మాట్లాడుతూ ఏనుగుల వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వవన్నారు. జోన్ పనులు జరగవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ఎస్ఐ ఎం.రాజేష్‌తో పాటు సీపీఎం జిల్లా కమిటీ నాయకులు రెడ్డి వేణు, మండల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ పాల్గొన్నారు.



సీపీఎం నాయకులతో చర్చిస్తున్న ఫారెస్టు అధికారులు

జీడిపంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

పాలకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జీడి మామిడి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ జీడిమామిడి రైతుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎల్ఎల్‌పురం పంచాయతీ సచివాలయం కార్యదర్శికి గురువారం వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా కోశాధికారి బొత్స గౌరునాయుడు మాట్లాడుతూ పంట చేతికి వచ్చిన సమయంలో జీడి పిక్కల ధరను ఉన్న ఫలంగా తగ్గించి దళారులు, వ్యాపారులు ఒకటై రైతులకు నష్టం తీసుకొస్తున్నారన్నారు. ప్రభుత్వమే క్వింటాకు రూ.20 వేలుగా మద్దతు ధరను ప్రకటించి దళారుల నుంచి రైతులను కాపాడాలన్నారు. ఏపీ రైతు సంఘం సీనియర్ నాయకుడు ద్వారపూడి అప్పలనాయుడు, సర్పంచ్ ప్రతినిధి కుమార్, వైస్ ప్రెసిడెంట్ కూరంగి గౌరునాయుడు, నాగేశ్వరరావు, లక్ష్మునాయుడు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ ఘీంకరింపు!

(ఒకటో పేజీ తరువాయి)

పరుశురాంపురం గ్రామానికి చెందిన ఆర్.లక్ష్మునాయుడు, డిసెంబరు 7న దళాయిపేటలో ఒక ఆవు దూడ

● 2021 మే 6న కళ్లికోటకు చెందిన ఎ.అప్పన్నలు మృతిచెందారు.

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిధిలో..

● 2007 అక్టోబరు 14న సీతంపేట మండలం చిన్న బగ్గకు చెందిన వసుపురెడ్డి అప్పారావు

● 2007 అక్టోబరు 14న సీతంపేట మండలం దోనుబాయికి చెందిన సిరిపోతుల మరియమ్మ

● 2007 అక్టోబరు 19న వీరఘట్టానికి చెందిన కుంభిడి నాగరాజు

● 2007 అక్టబరు 21న వీరఘట్టం మండలం సంతనర్సిపురం వాసి తెంటు శ్రీనివాసరావు

● 2008 జనవరి 21న వీరఘట్టం మండలం చలివేంద్రికి చెందిన కొండగొర్రి సాంబయ్య

● 2019 జూన్ 17న సీతంపేట మండలం ఈతమానుగూడకు చెందిన సవర గైరమ్మ

● 2019 జూన్ 17న సీతంపేట మండలం పెద్దమండకు చెందిన సవర పోడమ్మ

మన్యం జిల్లాగా ఏర్పడిన తరువాత..

● 2023 జనవరి 19న భామిని మండలం తాలాడకు చెందిన గోపిశెట్టి చిన్నారావు

● 2023 ఫిబ్రవరి 6న భామిని మండలం సవర తిడ్డిమికి చెందిన లోకొండ లక్ష్మీనారాయణ

● 2024 ఆగస్టు 26న పార్వతీపురం మండలం వన్నాం గ్రామానికి చెందిన వాన శివుడు

● బలిజిపేట మండలంలో ఒకరు మృతి చెందారు.

గాయపడిన వారు..

● 2019 జనవరి 25న కొమరాడ మండలం కళ్లికోటకు చెందిన బి.గంగులు

● 2019 సెప్టెంబరు 11న సీతానగరం మండలానికి చెందిన ఎస్.సింహాచలం

● 2019 మార్చి 14న గరుగుబిల్లి మండలం నందివానివలసకు చెందిన వి.శ్రావణ్‌కుమార్‌లు గాయపడ్డారు.

సంరక్షణ కేంద్రాలు ఏమైనట్లు..?

జిల్లా పరిధిలో ఏనుగుల సంరక్షణ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల అటవీ అధికారులతో పాటు ఫారెస్ట్ రేంజర్లు బృందం 2010లో తమిళనాడు రాష్ట్రం మదురైలో ఎలిఫెంట్ కన్జర్వేషన్ అండ్ కేర్ సెంటర్ (ఈసీసీసీ)ని సందర్శించారు. ఏనుగుల రక్షణ సాధ్యాసాధ్యాలను తెలుసుకున్నారు. దీని ఆధారంగా దాదాపు 100 నుంచి 200 హెక్టార్లలో ఏనుగుల శిబిరం ఏర్పాటు చేయాల్సి ఉందని భావించారు. ఇందులో 75 నుంచి 100 హెక్టార్లలో నీటి వనరులు, ఏనుగుల నివాసానికి అనువైన భూభాగం ఏర్పాటు, మిగిలిన ప్రాంతంలో వాటికి ఆహారం అందించడం, చెరకు, గడ్డి, పండ్ల జాతి మొక్కల పెంపకం, అటవీ జాతుల విస్తీర్ణం, దానికి అనువైన వెదురు ఆవాసాలను పెంచడం, ఇనుప రైలింగ్‌తో కంచె , దానికి ఇరువైపులా కందకాలు ఏర్పాటు , నీటి లభ్యతకు సోలార్ బోర్లు, లేకపోతే భారీ ఊట చెరువుల నిర్మాణం చేయాల్సి ఉందని తెలుసుకున్నారు.

● ఏనుగుల సంరక్షణ ఆవాసాలుగా మార్చేందుకు పార్వతీపురం మండలం తోటపల్లి (నాగావళి నది) ప్రాంతం, జియ్యమ్మవలస మండలం వట్టిగెడ్డ రిజర్వాయర్, కురుపాం మండలంలోని బోడికొండ , మక్కువ మండలంలో జంతికొండ, పార్వతీపురం మండలం అర్తాం రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాలను పరిశీలనలోకి తీసుకున్నారు. కానీ దీనికి గిరిజనుల నుంచి తీవ్ర వ్యతిరేకత, అనువైన అదనపు స్థలం రెవెన్యూశాఖ సమకూర్చలేకపోవడం వంటి ఇతర కారణాల వల్ల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు తీవ్ర జాప్యం జరిగింది.

● చివరికి సీతానగరం మండలం అమ్మాదేవి కొండ చుట్టూ కందకాలు తవ్వే పనుల్లో అటవీశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. దీనికి కూడా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో పరిస్థితి ఎలా ఉంటుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

● ఇక ఏనుగుల సమస్య పరిష్కారానికి కాంపెన్సేటరీ అఫారెస్టింగ్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (కంపా), ప్రాజెక్ట్ ఎలిఫెంట్ పథకాలను అధికారులు తెరపైకి తెచ్చినా కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయడం లేదు.

పంట నష్టాలపై తీవ్ర వ్యతిరేకత..

ఏనుగుల కారణంగా సంభవిస్తున్న పంట నష్టాలపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనిపై జారీ చేసిన జీవో ఎంఎస్ నంబరు 57/2014 చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ జీవో ప్రకారం.. వరి, చెరకు, అరటి నష్ట పరిహారం కింద ఎకరాకు రూ. 6 వేలు, మామిడి, కొబ్బరి పూర్తిగా నాశనమైతే చెట్టుకు రూ. 1500 చొప్పున ఇవ్వడానికి నిర్ణయించారు. అయితే ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని రైతులు పలు సందర్భాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియజేశారు. ఇటీవల కుదమ రెవెన్యూ పరిధిలో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చౌదరి కలెక్టర్‌తో కలిసి పర్యటించినప్పుడు కూడా రైతులు పంట నష్టాలపై వేడుకున్నారు. కాగా పంట నష్టాల అంచనా వేయడంలో అటవీ, రెవెన్యూ, ఉద్యాన శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. అయితే ఎప్పుడూ అటవీశాఖే నష్టాలను అంచనా వేసి పరిహారం ఇస్తుండడంతో రైతులకు నష్టమే మిగులుతోంది.

● పంట నష్టాల విషయంలో అటవీశాఖ ఉద్యోగి ఒకరు ఏనుగులు సంచరించిన ప్రాంతాలకు వెళ్లి రైతులకు దరఖాస్తులు ఇస్తారు. వాటిపై రెవెన్యూ, ఉద్యాన శాఖల అధికారుల సంతకాలు చేయించిన తర్వాత రైతుల నుంచి మళ్లీ వాటిని సేకరించి అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్తారు. అయితే సిబ్బంది కొరత నేపథ్యంలో ఇలా ఒక ఉద్యోగిని ఈ పని కోసం కేటాయించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా ఇందుకోసం ప్రత్యేక యాప్ ఏర్పాటు చేస్తే రైతులకు మేలు చేసినట్లవుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

ఏడాదిన్నరలోగా పరిష్కరిస్తాం..

ఏనుగుల తరలింపు అనేది ఒక సాహసోపేత నిర్ణయం. ప్రస్తుతం వాటి పునరావాసం ఏర్పాటుకు దృష్టి సారించాం. జిల్లాలో ఏనుగుల బెడదను పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. మరో ఏడాదిన్నరలోగా కచ్చితంగా పరిష్కారం ఉంటుంది.

-మణికంఠేశ్, జిల్లా అధికారి, ఎలిఫెంట్ మానటరింగ్ యూనిట్, పార్వతీపురం మన్యం

స్వయం ఉపాధికి లబ్ధిదారుల ఎంపిక

వీరఘట్టం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి నిమిత్తం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ మండలానికి 100 యూనిట్లు మంజూరు కాగా, 649 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరఘట్టం భారతీయ స్టేట్ బ్యాంకు, ఆంధ్రా బ్యాంకు, ఏపీజీవీబీ, డీసీసీబీ అధికారులు పాల్గొన్నారు.

రేపు జియ్యమ్మవలసలో ధ్రువపత్రాల పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలో స్వయం ఉపాధికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి ధ్రువపత్రాల పరిశీలన శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తామని ఎంపీడీవో ఎస్.రమేష్ తెలిపారు. లబ్ధిదారులు కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఇతర ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకుని రావాలన్నారు.

నేడు పార్వతీపురంలో..

పార్వతీపురం రూరల్: మండలంలోని బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారి ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం పార్వతీపురం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో జి.రమణమూర్తి తెలిపారు. దరఖాస్తుదారులు ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

ప్రసవించిన ఏనుగు

గుమ్మలక్ష్మీపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలో సంచరిస్తున్న ఏనుగుల సంఖ్య ఇప్పుడు 8కి చేరింది. గురువారం ఉదయం ఒక ఏనుగు ప్రసవించింది. ఇప్పటివరకు ఏడు ఏనుగులు ఉండగా పిల్ల ఏనుగుతో ఆ సంఖ్య 8కి చేరింది. తల్లి, పిల్ల ఏనుగులు సురక్షితంగా ఉన్నాయని ఎలిఫెంట్ మోనటరింగ్ అధికారి మణికంఠేష్ తెలిపారు. గత రెండేళ్లలో రెండు ఏనుగు పిల్లలు జన్మనిచ్చాయి.

నవోదయంలో భాగస్వాములు కావాలి

జియ్యమ్మవలస, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాను సారా రహిత జిల్లాగా మార్చడంలో ప్రజలే భాగస్వాములు కావాలని జిల్లా ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు కోరారు. గురువారం ఆయన మండలంలోని శిఖబడి, గడసింగుపురం గ్రామాల్లో నవోదయం 2.0పై సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. ఇందులో భాగంగా సారా తయారీ, రవాణా, అమ్మకాలు జరగకుండా గ్రామస్థులే పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీనికి సంబంధించి ఏమైనా జరిగితే సెల్ నెంబరు 6302936599కు గానీ, కాల్ సెంటర్ 08963-222778కు గానీ సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు, ఎస్ఐ జె.రాజశేఖర్, దత్తత గ్రామ అధికారులు పి.నరేంద్రకుమార్, ఎ.శ్రావణ్ కుమార్, జియ్య మ్మవలస పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎన్.ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

సంపూర్ణ సారా నిర్మూలనే ధ్యేయం

పార్వతీపురం టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సంపూర్ణ సారా నిర్మూలనే ప్రభుత్వం ధ్యేయమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.సురేష్ అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా తయారీ, అమ్మకాలు చేపట్టే 24 గ్రామాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా గుర్తించిందని తెలిపారు. ఆయా గ్రామాల్లో 24 గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఎనిమిది కేసుల్లో 13 మందిని అరెస్టు చేసి 261 లీటర్ల సారాను సీజ్ చేశామని చెప్పారు.

తోటపల్లి ఆక్రమణలపై అధికారులు స్పందించాలి

గరుగుబిల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన ఆక్రమణలపై అధికారులు స్పందించాలని పలువురు కోరారు. ఈ మేరకు దేవస్థానానికి చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాలని గురువారం దేవస్థానం ఆవరణలో తీర్మానించారు. పూర్తిస్థాయిలో రీసర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించాలని కోరారు. సమావేశంలో మాజీ తోటపల్లి దేవస్థానం చైర్మన్ ఎం.సత్యంనాయుడు, టీడీపీ నాయకుడు పల్ల రాంబాబు, ఆలయ అభివృద్ధి కార్యదర్శి డా.డి.పారినాయుడు, తోటపల్లి, సంతోషపురం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఉగాది రోజూ సేవలు

పార్వతీపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండగ నాడూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేయనున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు కావడం వల్ల లక్ష్యాలను చేరుకునేందుకు వీలుగా యథావిధంగానే ఉగాది పర్వదినాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా ప్రజలకు సేవలు అందనున్నాయి.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శామ్యూల్

పాలకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పాలకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శామ్యూల్ ఎన్నికయ్యారు. సీనియర్ అడ్వకేట్ ఉత్తరావల్లి మురళీమోహన్ అధ్యక్షతన గురువారం ఈ ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా శామ్యూల్, ఉపాధ్యక్షుడిగా అల్లు రఘురాం, కార్యదర్శిగా కె.పద్మలత, జాయింట్ సెక్రటర్‌గా దుప్పాడ ఆనందరావు, ట్రెజరర్‌గా మరిచెర్ల జగన్మోహన్‌రావును ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో సీనియర్ న్యాయవాదులు సీమల కృష్ణారావు, బలగ నరసింహారావు, బొడ్డు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

22 మందిపై బైండోవర్ కేసులు

సాలూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో 22 మంది సారా అమ్మకందారులపై బైండోవర్ కేసులు నమోదు చేశామని, వారిని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం హాజరు పరిచామని ఎక్సైజ్ సీఐ దాస్ తెలిపారు. వీరు తోణాం, మర్రిపల్లి, నక్కడవలస గ్రామాలకు చెందిన వారని ఆయన చెప్పారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఉప కేంద్రం పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ టీజేకే మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 11 కేవీ బూర్జ ఫీడర్‌పైన నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందన్నారు. అంపిలి, కొండాపురం, అన్నవరం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

గుమ్మలక్ష్మీపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మండల కేంద్రంలో పార్టీ జెండా ఆవిష్కరణలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని కోరారు.

ప్రజ్ఞ వికాసం పరీక్షల్లో కురుపాం విద్యార్థి ప్రతిభ

కురుపాం, మార్చి27 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞ వికాసం పరీక్షలో కురుపాం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి బిడ్డిక శ్రీరామ్ తృతీయ స్థానం సాధించాడు. ఈ మేరకు గురువారం యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.రాజు తదితరులు.. విద్యార్థికి రూ.2వేలతో పాటు మెమొంటో ను అందజేశారు. ఈసందర్భంగా హెచ్ఎం జి.రామగోవింద్, వార్డెన్ కె.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.